

# మ్యాజిక్ రిపీట్ అవుతుంది

''భీష్మ' తర్వాత దర్శకుడు వెంకీతో నాకిది రెండో సినిమా. టీజర్, సాంగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది' అన్నారు హీరో నితిన్. ఆయన తాజా చిత్రం 'రాబిన్‌హుడ్' డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ మాట్లాడుతూ..ఈ రాబిన్‌హుడ్ నిర్మాతలు పెట్టిన డబ్బుకి రెండింతల డబ్బుని వసూలు చేస్తాడని, 'భీష్మ' సినిమా మ్యాజిక్ మళ్లీ రిపీట్ అవుతుందని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'రాబిన్‌హుడ్ కాన్సెప్ట్ అనగానే పెద్దల సంపదను దోచి పేదలకు పంచిపెట్టే కథానాయకుడి పాత్రలే గుర్తుకొస్తాయి. కానీ ఈ సినిమా కథ అందుకు భిన్నంగా ఉంటుంది. క్రిస్మస్ సీజన్‌లో వినోదాత్మక కుటుంబ కథా చిత్రంగా మెప్పిస్తుంది' అన్నారు. ఈ సినిమా తన కెరీర్‌లో చాలా ప్రత్యేకమని, ఇప్పటివరకు తనలోని డ్యాన్స్ టాలెంట్‌నే చూశారని, ఈ సినిమాతో యాక్టింగ్ టాలెంట్‌ను నిరూపించుకునే అవకాశం దక్కిందని కథానాయిక శ్రీలీల చెప్పింది. నితిన్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్‌తో ఈ సినిమా తీశామని, అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని, తప్పకుండా అందరికి నచ్చుతుందని చిత్ర నిర్మాతలు వై.రవిశంకర్, నవీన్ ఏర్నేని పేర్కొన్నారు.



# వెన్నెల రాత్రి గోదారిగట్టుపై..

వెంకటేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకుడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టబోతున్నారు. డిసెంబర్ 3న తొలి పాట విడుదలకానుంది. బుధవారం ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందించిన ఈ పాటను రమణ గోగుల ఆలపించారు. భాస్కరభట్ల రచించారు. గోదావరి గట్టుపై, వెన్నెల రాత్రి నేపథ్యంలో రొమాంటిక్ గీతంగా అలరిస్తుందని, వెంకటేష్, ఐశ్వర్యరాజేష్ మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం వెంకటేష్, మీనాక్షిచౌదరిలపై డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అందమైన లొకేషన్స్‌లో ఓ పాటను తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

# ఇక అతనితోనే పయనం!

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ పెళ్లి గురించి కొంతకాలంగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తన కాలేజీ ఫ్రెండ్‌తో ఈ భామ ప్రేమలో ఉందని, త్వరలో అతన్ని పెళ్లాడనుందని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై కీర్తి సురేష్ బుధవారం అధికారిక ప్రకటన చేసింది. ప్రియుడు ఆంటోనీతో దీపావళి సందర్భంగా తీసుకున్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. తమ స్నేహ బంధం జీవితాంతం కొనసాగనుందని తెలిపింది. ఈ వార్త తెలుసుకున్న పలువురు సినీ సెలబ్రిటీలు కీర్తి సురేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఇక అభిమానులు ఆంటోని వ్యక్తిగత వివరాల గురించి సోషల్‌మీడియాలో ఆరా తీయడం మొదలుపెట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కాలేజీ రోజుల నుంచే కీర్తి సురేష్-ఆంటోని మంచి స్నేహితులని తెలిసింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆంటోని కొంతకాలం విదేశాల్లో ఉద్యోగాలు చేశాడని, ప్రస్తుతం కేరళలో పలు వ్యాపారాలను నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఇరు కుటుంబాల అనుమతితోనే కీర్తి సురేష్ తన రిలేషన్‌షిప్‌పై ప్రకటన చేసిందని, త్వరలో ఈ జంట పెళ్లిపీటలెక్కనున్నారని తెలుస్తున్నది. 'నేను శైలజ' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన కీర్తి సురేష్ అనతికాలంలోనే దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఎదిగింది. 'మహానటి' చిత్రంలో అద్భుతాభినయానికిగాను ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె రివాల్వర్ రీటా, బేబీ జాన్ చిత్రాల్లో నటిస్తున్నది.







# టీమ్ అందరిని మిస్ అవుతున్నా!

'పుష్ప-2' షూటింగ్‌ను గత సోమవారం రోజున ముగించిన విషయం తెలిసిందే. దాదాపు రెండు సంవత్సరాలుగా సాగిన షూటింగ్‌కు ఆ రోజు గుమ్మడికాయ కొట్టేశారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ తాలూకు జ్ఞాపకాలను తలచుకొని ఉద్వేగానికి గురైంది కథానాయిక రష్మిక మందన్న. షూటింగ్ చివరి రోజు ఇక తాను సెట్‌లోకి రాలేనని తెలిసి ఎమోషనల్‌గా ఫీలయ్యానని రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొంది. 'నవంబర్ 25 నా జీవితంలో భావోద్వేగభరితమైన రోజు. షూటింగ్ చివరి రోజు అని తెలిసి చాలా బాధపడ్డాను. ఆఖరి రోజు ఓ స్పెషల్ సాంగ్ షూట్ చేశాం. రాత్రి వరకూ సెట్‌లోనే ఉన్నా. గత ఐదేళ్లుగా ఈ టీమ్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నా కాబట్టి అది సెట్‌లాగా అనిపించలేదు. అది నా ఇల్లులా మారింది. అప్పటివరకు సినిమా కోసం పడిన కష్టం, షూట్ సమయంలోని ఎన్నో జ్ఞాపకాలు ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. షూటింగ్ పూర్తయిందనే సంతోషం ఓ వైపు, సెట్‌ను విడిచిపోతున్నానే బాధ మరో వైపు..ఇలా ఎన్నో భావోద్వేగాలతో నా మనసు నిండిపోయింది. టీమ్ అందరిని మిస్ అవుతున్నాననే బాధతో ఒక్కసారిగా కన్నీళ్లొచ్చాయి. నేను చాలా రోజుల తర్వాత ఏడ్చాను. అలా ఎందుకు ఫీల్ అయ్యానో అర్థం కాలేదు. గొప్ప టీమ్‌తో పనిచేసినప్పుడు వారితో తెలియని అనుబంధం ఏర్పడుతుంది. ఆ ఫీలింగే నన్ను కదిలించింది' అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొంది.



# సూర్య కొత్త చిత్రం

ఇటీవలే పీరియాడిక్ చిత్రం 'కంగువ'తో ప్రేక్షకుల ముందుకొచ్చా రు తమిళ అగ్ర హీరో సూర్య. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో సూర్య తన 45వ చిత్రాన్ని మొదలుపెట్టారు. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్.ఆర్.ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బుధవారం తమిళనాడులోని అన్నామలైలో ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోయంబత్తూర్‌లో తొలి షెడ్యూల్ జరుగుతుందని, సూర్యపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తామని దర్శకుడు తెలిపారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమా తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# గంధర్వకోట రహస్యం

హన్సిక ప్రధాన పాత్రలో నటిస్తున్న తమిళ చిత్రం 'శ్రీగాంధారి' అదే పేరుతో తెలుగులోకి రానుంది. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ఆర్.కన్నన్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని రాజు నాయక్ తెలుగులో విడుదల చేస్తున్నారు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. శతాబ్దాల క్రితం ఓ రాజు నిర్మించిన గంధర్వకోటలో ఎన్నో రహస్యాలుంటాయి. వాటిని బయటపెట్టే క్రమంలో జరిగిన సంఘటనలేమిటన్నదే ఈ చిత్ర కథ. ఈ సినిమాలో హిందూ ట్రస్ట్ కమిటీకి హెడ్ ఆఫీసర్‌గా హన్సిక కనిపించనుంది. గంధర్వకోట ప్రాజెక్ట్‌ను చేపట్టిన ఆమెకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయన్నది ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. మిస్టరీ, సస్పెన్స్, హారర్‌థ్రిల్లర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎల్వీ గణేష్ ముత్తు, నిర్మాత: రాజు నాయక్, దర్శకత్వం: ఆర్.కన్నన్.





# ప్రేమ ప్రయాణంలో..

ప్రదీప్ మాచిరాజు హీరోగా నటిస్తున్న చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. డుయో నితిన్-భరత్ దర్శకత్వం వహించారు. దీపికా పిల్లి కథానాయిక. మాంక్స్ అండ్ మంకీస్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలోని తొలి గీతాన్ని బుధవారం అగ్ర హీరో మహేష్‌బాబు లాంచ్ చేశారు. రథన్ స్వరపరచిన ఈ పాటను ఉదిత్ నారాయణ్ ఆలపించారు. శ్రీధర్ ఆవునూరి సాహిత్యాన్ని అందించారు. 'ప్రేమికుల మదిలోని భావాలను ఆవిష్కరించే అందమైన పాట ఇది. చక్కటి సాహిత్యం కుదిరింది. చాలా విరామం తర్వాత ఉదిత్ నారాయణ్ తెలుగులో పాట పాడటం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఓ వినూత్నమైన ప్రేమకథగా ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎమ్ఎన్ బాలరెడ్డి, సంగీతం: రథన్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నితిన్-భరత్.



# వీకెండ్‌లో ఏం జరిగింది?

శ్రీ, ప్రియా దేషపాగ జంటగా నటిస్తున్న 'వీకెండ్' సినిమా షూటింగ్ బుధవారం ఏపీలోని చీరాలలో మొదలైంది. బి.రాము దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఖడ్గధార మూవీస్ పతాకంపై భారతి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అజయ్ ఘోష్ క్లాప్‌నిచ్చారు. 'క్రైమ్ థ్రిల్లర్ కథాంశమిది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి. ఓ జంట జీవితంలో వీకెండ్ సమయంలో జరిగిన అనూహ్య సంఘటనలేమిటన్నదే చిత్ర ఇతివృత్తం. మొదటి షెడ్యూల్ మొత్తం చీరాలలోనే జరుపుతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: యూఎస్ విజయ్, సంగీతం: ఎన్.అర్జున్, రచన-దర్శకత్వం: రాము.బి.



# 'స్లమ్‌డాగ్ మిలియనీర్'కు సీక్వెల్

ముంబయిలోని జుహూ మురికివాడకు చెందిన యువకుడి స్ఫూర్తిదాయక ప్రయాణం ఆధారంగా తెరకెక్కించిన హాలీవుడ్ చిత్రం 'స్లమ్‌డాగ్ మిలియనీర్' (2008) ప్రపంచవ్యాప్తంగా ఆదరణ దక్కించుకుంది. ఎనిమిది ఆస్కార్‌లను గెలుచుకొని రికార్డు సృష్టించింది. ఈ సినిమాతో స్వరకర్త ఏ.ఆర్.రెహమాన్ ఆస్కార్ గెలుచుకొని భారతదేశ కీర్తిని చాటారు. ఈ సినిమా సీక్వెల్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. హాలీవుడ్‌కు చెందిన నిర్మాణ సంస్థ బ్రిడ్జ్ 7 ఈ సీక్వెల్‌కు సంబంధించిన హక్కులను సొంతం చేసుకుంది. త్వరలో సీక్వెల్ తాలూకు ప్రీప్రొడక్షన్ వర్క్‌ను మొదలుపెట్టబోతున్నామని, కొన్ని కథలను ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, అందులో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఒకటని నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఈ చిత్రంలో దేవ్ పటేల్, ఫ్రిదా పింటో, మధుర్ మిట్టర్, అనిల్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు.



# ఫ్యామిలీ థ్రిల్లర్ 'ఒసేయ్ అరుంధతి'

వెన్నెల కిషోర్, మోనికా చౌహాన్, కమల్‌కామరాజు ప్రధాన పాత్రల్లో నటించిన ఫ్యామిలీ థ్రిల్లర్ 'ఒసేయ్ అరుంధతి'. విక్రాంత్ కుమార్ దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి గూడూరు నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాద్‌కు చెందిన ఓ మధ్యతరగతి ఇల్లాలు అరుంధతి నేపథ్యంలో నడిచే కథ ఇది. దానినుంచి ఆమె ఎలా బయటపడింది? ఈ క్రమంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయన్నది ఆసక్తికరంగా ఉంటుంది. కామెడీ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది' అన్నారు. కథలో థ్రిల్లింగ్ అంశాలతో పాటు కామెడీ హైలైట్‌గా నిలుస్తుందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు.


